సాక్షి
చిత్తూరు

మంగళవారం, 3, అక్టోబర్, 2023



శోభాయమానం.. సోమవారోత్సవం

రామకుప్పం సమీపంలోని సుబ్రమణ్యస్వామి ఆలయంలో సోమవారం వైభవంగా సోమవారోత్సవం నిర్వహించారు. - 8లో



ఇంజెక్షన్.. ఇన్‌ఫెక్షన్

కొందరు అవగాహన లేని వైద్యుల కారణంగా అభం శుభం తెలియని పసికందులు ప్రాణాలు కోల్పోతున్నారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	24
తిరుపతి	35	25
తిరుమల	31	22
గూడూరు	37	27
నగరి	36	25

న్యూస్‌రీల్

నేడు ఏపీపీఎస్సీ పరీక్ష

- పకడ్బందీ నిర్వహణకు ఏర్పాట్లు : డీఆర్‌ఓ



మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఏపీపీఎస్సీ పరీక్ష నిర్వహించనున్నారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ రాజశేఖర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఏపీపీఎస్సీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఇందుకోసం పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా ప్రొబెషన్ ఆఫీసర్ గ్రేడ్- 2, టెక్నికల్ అసిస్టెంట్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ అఫ్ ఫిషరీస్, జూనియర్ ట్రాన్స్‌లేటర్ ఇన్ తెలుగు, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్, టెక్నికల్ అసిస్టెంట్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, గ్రూప్ 4 సర్వీసెస్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు గాను పరీక్ష నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో పరీక్ష జరుగుతుందని వెల్లడించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని స్పష్టం చేశారు. ఎగ్జామ్ సెంటర్ వద్ద 144 సెక్షన్ విధించాలని, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను లోపలికి అనుమతించవద్దని ఆదేశించారు. అలాగే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ వాసుదేవన్, ఏపీపీఎస్సీ అధికారి నందగోపాల్, వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి, లైజన్ ఆఫీసర్ ధనంజయలు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ సర్వ సభ్య సమావేశం

చిత్తూరు రూరల్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో మంత్రులు పాల్గొననున్నట్లు వెల్లడించారు. సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.



పుష్పాలంకరణలో స్వామివారి ధ్వజస్తంభం



ఉభయ దేవేరీ సమేతంగా ఊరేగుతున్న స్వామివారు

సూర్య తేజం..
స్వయంభు స్వరూపం

- సిద్ధి, బుద్ధి సమేతంగా సూర్యప్రభ వాహనంపై వరసిద్ధుని విహారం

కాణిపాకం(యాదమరి): ప్రత్యేక ఉత్సవాల్లో కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారు సిద్ధి, బుద్ధి సమేతంగా సూర్యప్రభ వాహనంపై సోమవారం రాత్రి విహరించారు. ఈ సందర్భంగా వేకువనే స్వామికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి ఉభయదేవేరీ సమేతంగా గణనాథుని ఉత్సవర్లను శోభాయమానంగా అలంకరించి, సూర్యప్రభ వాహనంపై కొలువు దీర్చారు. మంగళవాయిద్యాలు, కోలాటాలు, భజనల నడుమ మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వాహన సేవకు శ్రీమతి సి.రాజమ్మ, రాజశేఖర్ నాయుడు కుమారులు ఇంద్రసేన నాయుడు బ్రదర్స్ బొమ్మ సముద్రం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు. మంగళవారం ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా స్వామివారు చంద్రప్రభ వాహనంపై విహరించనున్నారు.

విశేషాలంకరణ

వినాయక స్వామివారి సూర్యప్రభ, చంద్రప్రభ వాహన సేవలను పురస్కరించుకుని ఉభయకర్తలు ఆలయంలోని అన్వేటి , సుపథ మండపాలు, ధ్వజస్తంభాన్ని విదేశీ పుష్పాలతో విశేషంగా అలంకరించారు.

కిక్కిరిసిన ఆలయం

వినాయక స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. సోమవారం వేకువనే కంపార్ట్‌మెంట్లు, క్యూలు నిండిపోయాయి. ఈ మేరకు ఆలయాధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

నేడు పట్టు వస్త్రాలు సమర్పణ

దేవదాయశాఖ విశ్రాంత ఏడీసీ కేశవులు మంగళవారం ఉదయం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



కిటకిటలాడుతున్న క్యూ



సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన దేవదేవేరులు

గాంధీ అడుగు జాడలు ఆదర్శనీయం



తిరుపతి మారుతీనగర్‌లో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి మంగళం: ప్రతి ఒక్కరూ గాంధీ సిద్ధాంతాలను పాటించి, ఆయన ఆదర్శనీయ అడుగు జాడల్లో నడిచినప్పుడే హింసకు తావుండదని రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా ఆయన తిరుపతి మారుతీ నగర్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఘన నివాళులర్పించారు. గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి అంజ లి ఘటించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి మాట్లా డుతూ అహింసామార్గంలో బ్రిటీష్ వారి నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహానుభావుడు అని కొనియాడారు.

గ్రామ స్వరాజ్యం..
గాంధీజీ కలలు సాకారం



జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

- ఘనంగా జాతిపిత జయంతి
- మహాత్మునికి నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

చిత్తూరు రూరల్ : మహాత్మా గాంధీ కలలను సాకారం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని ఆవిష్కరించారని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని జెడ్పీ చైర్మన్‌తోపాటు కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, చుడా చైర్మన్ పురషోత్తంరెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ అరుణ, ఆర్‌డీఓ రేణుక ఘనంగా నివాళులర్పించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ జాతిపిత ఆశయాలకు అనుగుణంగా సచివాలయ వ్యవస్థ పనిచేస్తోందన్నారు. ఇదే స్ఫూర్తితో గ్రామీణాభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు వెల్లడించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. సత్యం అహింసా మార్గంలో పయనిస్తూ ఎందరికో దిశానిర్దేశం చేశారన్నారు. ఎమ్మెల్యే ఆరణి మాట్లాడుతూ ప్రజల ఆర్థికస్థితిగతులను ఉన్నతంగా తయారుచేసేందుకు ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీమేయర్ చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, నాయకులు భూపేష్‌గోపీనాథ్, జ్ఞానజగదీష్ తదితరులు పాల్గొన్నారు.

బాబు జీవితం.. జైలుకే పరిమితం



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం : స్కిల్ స్కామ్‌కు పాల్పడి ప్రజాధనం దోచుకున్న చంద్రబాబు జీవితం ఇక జైలుకే పరిమితమని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని అన్నూరులో ఆయన మాట్లాడుతూ అధికారాన్ని అడ్డు పెట్టుకుని యథేచ్ఛగా అవినీతికి పాల్పడిందుకే చంద్రబాబు జైల్లో కటకటాలు లెక్కపెడుతున్నారని విమర్శించారు. చట్టం ముందు అందరూ సమానమేనని, కోర్టుల్లో కులం కార్డు ఉపయోగపడదని వెల్లడించారు. అవినీతి పరుడు చంద్రబాబును అరెస్టు చేస్తే రేణుకా చౌదరి ఎందుకు ఉలిక్కిపడ్డారో చెప్పాలని ప్రశ్నించారు. పాపాలను తుడిచేసుకునేందుకు రూ.కోట్లు వెచ్చించి న్యాయవాదులను నియమించుకున్నా ప్రయోజనం ఉండదని తెలిపారు. కాపు జాతి కోసం పోరాడిన ముద్రగడను చంద్రబాబు హింసించినప్పుడు పవన్ కల్యాణ్ ఎక్కడున్నారని మండిపడ్డారు. అయితే తప్పులు చేసి ఊచలు లెక్కిస్తున్న ఘనుడిని కాపాడుకునేందుకు పవన్ తపిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, అన్నదాతలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై పవన్, ఎల్లోమీడియాకు ఎందుకింత కక్ష అని నిలదీశారు. జగనన్న తన తండ్రి ఫొటోతో పాదయాత్ర చేశారని, అందుకే ప్రతి పథకానికి వైఎస్సార్ పేరు పెట్టుకుంటున్నారని తెలిపారు. చంద్రబాబుకు నిజాయితీ ఉంటే ఎన్టీఆర్ ఫొటో, ఆయన స్థాపించిన టీడీపీని వదిలేసి సొంత పార్టీ పెట్టుకోవాలని సవాల్ విసిరారు. ఖర్జూరనాయుడు, లోకేష్ ఫొటో పెట్టుకుని ఒక్క సీటు గెలు పొందినా చంద్రబాబునే ముఖ్యమంత్రి చేస్తామని స్పష్టం చేశారు.

'జయహో సీఎం సార్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న మంత్రి రోజా, పక్కన ఎంపీలు రెడ్డెప్ప, గురుమూర్తి

పుత్తూరు రూరల్: సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో రాష్ట్ర డెమోక్రటిక్ సచివాలయం ఉద్యోగుల సంఘం వారు సిద్ధం చేసిన "జయహో సీఎం సార్" పోస్టర్‌ను మంత్రి ఆర్‌కే రోజా విడుదల చేశారు. సోమవారం శిల్పారామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు ఎంపీలు గురుమూర్తి, రెడ్డప్ప సమక్షంలో పోస్టర్ ఆవిష్కరించారు. మంత్రి రోజా మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా 1.30 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా డెమోక్రటిక్ సంఘ అధ్యక్షుడు డాక్టర్ చాంద్‌బాషా, సభ్యులు జె.వెంకటేష్, కె.ధనశేఖర్, కె.వెంకటేష్ పాల్గొన్నారు.

రోగులకు అండగా సీఎంఆర్‌ఎఫ్

- ముగ్గురు బాధితులకు రూ.11.25లక్షల సాయం



బాధితుడికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: మండలంలోని ముగ్గురు రోగులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నగదు సాయం అందించారు. సోమవారం ఈ మేరకు ఎమ్మెల్సీ భరత్ చేతులమీదుగా బాధితులకు చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని కెనమాకులపల్లె పంచాయతీ ఆరిముత్తనపల్లెకు చెందిన ధర్మేంద్ర కుమారుడు పృథ్వీ ఆదిత్య(2) నిమోనియాతో బాధపడుతూ బెంగళూరులో చికిత్స పొందాడు. చిన్నారి వైద్యం కోసం సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.10 లక్షలు మంజూరైంది. అలాగే అనికెర పంచాయతీ శెట్టిపల్లెకు చెందిన ఎస్.కార్తీక్(15)కు వైద్యానికి రూ.85వేలు, తుమ్మిశి పంచాయతీ డుంకుమానిపల్లెకు చెందిన బత్కుల్ బీ(51) చికిత్స నిమిత్తం రూ.40వేలు విడుదలైంది. బాధితుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ భరత్ చెక్కులు అందజేశారు. కష్టకాలంలో తమకు ప్రభుత్వం అండగా నిలిచిందని లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు ఏపీ జయరాం, శంకర్, చంగమరాజు, నాయకులు వీరభద్రప్ప, టీవీ భాస్కర్, ఎండీ బాబు, గంగాధర్ పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడి



ధ్వంసమైన అరటి చెట్ల వద్ద రైతు

సోమల: మండలంలోని బంగ్లా సమీపంలో ఏనుగుల గుంపు సోమవారం ఉదయం పంట పొలాలపై దాడి చేశాయి. అరటి, చెరుకు తదితర పంటలను నాశనం చేశాయి. బాధిత రైతులు మాట్లాడుతూ అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల బారి నుంచి తమ పంటలు కాపాడాలని కోరారు.

ఒంటరి ఏనుగు..

రామకుప్పం: మండలంలోని రామాపురం తండా వద్ద పంట పొలాలపై ఆదివారం రాత్రి ఒంటరి ఏనుగు దాడి చేసింది. రైతు గోవిందు నాయక్‌కు చెందిన వరి పంటతోపాటు పక్కనే ఉన్న అరటి తోటను నాశనం చేసింది.

చెక్‌డ్యామ్‌లో వ్యక్తి గల్లంతు



ఘటనాస్థలంలో గుమికూడిన జనం

శాంతిపురం : పాలారు నదిపై శాంతిపురం వద్ద ఉన్న చెక్ డ్యామ్‌లో ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. వివరాలు.. వి.కోట మండలం కొంగాటం గ్రామానికి చెందిన ముత్యాలు(50) శాంతిపురంలోని బంధువు ఇంటికి వచ్చాడు. సోమవారం సాయంత్రం చెక్ డ్యామ్‌పై నుంచి వెళుతూ కాలు జారి నీటిలో పడ్డాడు. స్థానికులు కాపాడేందుకు యత్నించినా ప్రయోజనం లేకపోయింది. నీరు ఎక్కువగా ఉండడంతో ముత్యాలు మునిగిపోయాడు. మృతదేహం కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

– మరొకరికి గాయాలు



రామిరెడ్డి (ఫైల్)

పుంగనూరు : పట్టణ సమీపంలోని భగత్‌సింగ్ కాలనీ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. పెద్దపంజాణి మండలం చళమంగళానికి చెందిన రామిరెడ్డి(36), నిండిగుంటకు చెందిన మంజునాథరెడ్డి(32) మదనపల్లెలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. గాంధీ జయంతి సందర్భంగా స్కూల్‌కు వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మార్గం మధ్యలో బొలేరో వాహనం వెనకనుంచి ఢీకొంది. దీంతో రామిరెడ్డి అక్కడికక్కడే మరణించాడు. గాయపడిన మంజునాథరెడ్డిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన బొలేరోను స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థిని అదృశ్యం

తిరుపతి క్రైం: స్థానిక పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతున్న పులిచెర్లకు చెందిన హాస్టల్ విద్యార్థిని ఆదివారం అదృశ్యమైనట్లు ఎస్వీయూ క్యాంపస్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. అప్రమత్తమైన పోలీసు అధికారులు ప్రత్యేక బృందాన్ని నియమించి ముమ్మరంగా గాలిస్తున్నారు.

- నాలుగు రోజుల క్రితం శ్రీరంగరాజపురం మండలం నీకే పురం గ్రామానికి చెందిన ప్రీతి (2నెలలు) అనే పసికందుకు తీవ్రమైన జలుబు, జ్వరం వచ్చింది. దీంతో తల్లిదండ్రులు బిడ్డను సరిహద్దు ప్రాంతంలోని పళ్లిపట్టులో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుడు ఇంజెక్షన్ ఇవ్వడంతో చిన్నారి దేహం రంగు మారిపోయింది. వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు బిడ్డను పరీక్షించి తగు చికిత్సలందించారు. ప్రైవేట్ హాస్పిటల్ డాక్టర్ అవగాహన లేకుండా అధిక మోతాదులో ఇంజెక్షన్ ఇవ్వడంతో చిన్నారి గుండెలో రక్తం గడ్డ కట్టిందని నిర్ధారించారు.
- చిత్తూరు నగరం 11వార్డులో వారం రోజుల పసికందు ఇన్‌ఫెక్షన్ బారిన పడింది. తల్లిదండ్రులు హుటాహుటిన అందుబాటులోకి ఓ ఆర్‌ఎంపీ వైద్యుడి దగ్గరకు తీసుకెళ్లారు. ఆయన ఇంజెక్షన్ వేయడంతో అది కాస్తా వికటించి చిన్నారి నాలుగు గంటల్లోనే మృత్యువాత పడింది.
- చిత్తూరు నగరం ఖాదర్‌మీనాన్ వీధికి చెందిన సర్దార్, రోష్నీ దంపతులకు జూలైలో బిడ్డ పుట్టింది. 15 రోజుల తర్వాత గొంతు కింద గడ్డ ఏర్పడింది. దీంతో జిల్లా ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. అక్కడి వైద్యుడు యాంటీబయాటిక్ ఇంజెక్షన్ ఇవ్వడంతో బిడ్డ శరీరం కట్టెబారిపోయింది. వెంటనే తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లగా చికిత్సపొందుతూ మరణించింది. దీనిపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులు సదరు వైద్యుడికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

ఇంజెక్షన్.. ఇన్‌ఫెక్షన్!

- చిన్నారుల వైద్యంలో ప్రైవేట్ హాస్పిటల్ డాక్టర్ల నిర్లక్ష్యం
- అవగాహన లేకుండా చికిత్సలు
- మోతాదు మించి వేస్తున్న ఇంజెక్షన్లతో పిల్లలకు ముప్పు
- ప్రభుత్వాస్పత్రుల్లోని పీడియాట్రీషన్లకు చూపించాలంటున్న నిపుణులు



చిత్తూరులోని జిల్లా ఆస్పత్రిలో శిశువులకు చికిత్స అందిస్తున్న దృశ్యం (ఫైల్)

చిత్తూరు రూరల్: అమ్మ గర్భంలో శిశువు అత్యంత సురక్షితంగా పెరుగుతుంది. జన్మించిన మరుక్షణం నుంచే ప్రపంచానికి అలవాటు పడేందుకు ఆరాట పడుతుంది. ఈ క్రమంలో పసికందు ఆరోగ్యం.. పోషణ చూసుకోవడం తల్లిదండ్రులు బాధ్యత. ముఖ్యంగా పుట్టిన తర్వాత తొలి 28 రోజులు బిడ్డ బతుకులో అత్యంత కీలకం. ఆరు నెలలు నిండే వరకు కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ఐదేళ్ల వయసు వరకు ఆలనా.. పాలనలో అప్రమత్తంగా ఉండాలి. ఇందులో చిన్నపాటి పొరపాటు జరిగినా పర్యవసానాలు జీవితాంతం వెంటాడుతాయి. ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చినా, ఇప్పటికీ శిశు మరణాలు సంభవిస్తూనే ఉన్నాయి. వీరిలో ఎక్కువ మంది పుట్టిన నెలలోపే.. అదీ ఒకటి రెండు రోజుల్లోనే కన్నుమూస్తూ ఉండడం కలచివేస్తోంది. ఇక ఇన్‌ఫెక్షన్లతో అయితే పెద్దసంఖ్యలో పసికందులు ఆస్పత్రుల పాలవుతున్నారు. కొందరు వైద్యులు అవగాహన లేమి, అందులోనూ పలువురు ఆర్‌ఎంపీ డాక్టర్ల అరకొర పరిజ్ఞానం కాస్తా చిన్నారుల ప్రాణాల మీదకు వస్తోంది. ముఖ్యంగా అధిక మోతాదులో వేస్తున్న ఇంజెక్షన్ల కారణంగా పసికందులు ఇన్‌ఫెక్షన్ల బారిన పడి మరణిస్తున్నారు.

శిశు మరణాలకు కారణాలు	జాగ్రత్తలు ఇలా...
• బిడ్డఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు.	• గర్భం దాల్చినప్పటి నుంచి విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి
• తక్కువ బరువుతో పుట్టడం.	• స్పెషలిస్ట్ డాక్టర్లను సంప్రదించాలి.
• నెల తక్కువగా జన్మించడం	• సక్రమంగా పౌష్టికాహారం తీసుకోవాలి
• న్యుమోనియా	• తరచూ బీపీ తో పాటు రక్తహీనత పరీక్ష చేయించుకోవాలి
• గుండె సంబంధిత సమస్యలు	• ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం సురక్షితమని గుర్తించాలి
• మెదడు వాపు	• బిడ్డ పుట్టిన తర్వాత మరింత అప్రమత్తంగా చూసుకోవాలి
• బ్లడ్ ఇన్‌ఫెక్షన్లు	• చిన్నపిల్లల వైద్యులకే పసికందును చూపించాలి..
• జలుబు, తీవ్ర జర్వం	• ఆర్‌ఎంపీల వద్ద వైద్యం చేయించకపోవడం ఉత్తమం
	• చిన్న పిల్లల స్పెషలిస్టు డాక్టర్లు సూచనల మేరకే ఇంజెక్షన్ వేయించాలి
	• అది కూడా తగిన మోతాదులోనే ఇవ్వాలి • క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి..

బిడ్డకు భద్రత అవసరం

అప్పుడే పుట్టిన బిడ్డకు రోగనిరోధకశక్తి తక్కువగా ఉంటుంది. అందువల్ల బిడ్డకు ఇన్‌ఫెక్షన్లు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకప్పుడు పురుడు అయ్యేంతవరకు తల్లీబిడ్డను ప్రత్యేక గదిలోనే ఉంచేవారు. ఇతరులను అందులోకి రానిచ్చేవారు కాదు. ఒకరో ఇద్దరో తల్లీబిడ్డల అవసరాలను చూసుకునేవారు. ఇది ఇన్‌ఫెక్షన్ల నివారణకు ఉపయోగపడేది. అయితే ఆస్పత్రుల్లో కాన్పులు పెరిగిపోతున్న తరుణంలో ఇది మరుగున పడిపోయింది. కాన్పయిన మరుక్షణం నుంచే బంధువులు ఆస్పత్రికి వస్తుంటారు. చేతులు, కాళ్లు కడుక్కోకుండానే బిడ్డను ఎత్తుకోవటం, ముద్దులు పెట్టటం చేస్తుంటారు. దీంతో బిడ్డకు ఇన్‌ఫెక్షన్ల ముప్పు పెరుగుతోంది. తల్లికీ ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. అందుకే తల్లీబిడ్డలను కనిపెట్టుకునేవారు తప్ప మిగతావాళ్లు దూరంగా ఉండటం మంచిదని గుర్తించాలి. ముఖ్యంగా తొలి 15 రోజుల్లో బాలింతను, బిడ్డను బయటివారు తాకకుండా చూసుకోవటం ఎంతైనా మంచిది.

జిల్లా సమాచారం

జిల్లా ఆస్పత్రి	:	01
ఏరియా వైద్యశాలలు	:	04
పీహెచ్‌సీలు	:	50
సీహెచ్‌సీలు	:	07
ప్రైవేట్ హాస్పిటళ్లు	:	సుమారు 2 వేలు

జిల్లాలో ప్రసవాల సమాచారం

నెల	సంఖ్య
జూన్	3,012
జూలై	2,841
ఆగస్ట్	3,230
సెప్టెంబర్	3,002

శిశుమరణాల వివరాలు

ఏప్రిల్	16
మే	14
జూన్	19
జూలై	12
ఆగస్ట్	12
సెప్టెంబర్	18



చిన్నారికి చికిత్స చేస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

అవగాహన అవసరం



శిశువు జన్మించిన తర్వాత మరింత జాగ్రత్తగా ఉండాలి. బిడ్డ ఆరోగ్య విషయాలపై అవగాహన అవసరం. అధిక జ్వరం, జలుబును కూడా తేలిగ్గా తీసుకోకూడదు. పసికందును పడుకోబెట్టే ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. బిడ్డ ఇన్‌ఫెక్షన్‌కు గురైతే ఎక్కడపడితే అక్కడ చూపించకూడదు. చిన్న పిల్లల వైద్య నిపుణుల వద్దకే వెళ్లాలి.

– లత, చిన్న పిల్లల వైద్య నిపుణులు

శిశు మరణాల కట్టడికి చర్యలు



శిశుమరణాలను కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వైద్య సేవలను మెరుగుపరుస్తోంది. ఏరియా, సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రుల్లో అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయి. కానీ కొందరు అవగాహన లేమితో సరైన వైద్యులను సంప్రదించడం లేదు. పిల్లల విషయాల్లో కూడా అజాగ్రత్తగా ఉంటున్నారు. పసికందుల ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లోని చిన్న పిల్లల వైద్యులను సంప్రదించడం మంచిది.

– రవిరాజు, డీఐఓ, చిత్తూరు

శోభాయమానం.. సోమవారోత్సవం



ఆలయ ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు

రామకుప్పం: మండలకేంద్రం సమీపంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో శోభాయమానంగా సోమవారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ప్రాంగణంలోని శనీశ్వరస్వామి, నాగుల ముద్దమ్మ, పద్మావతీదేవి, శ్రీవేంకటేశ్వరస్వామి, అంజనేయస్వామి, ఓం శక్తి దేవాలయాలకు సైతం భక్తులు పోటెత్తారు. రావి చెట్టుకు పూజలు చేసి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

కనులపండువగా మయూర వాహన సేవ

ఉత్సవాల్లో భాగంగా ఉభయ దేవేరులతో కలిసి సుబ్రమణ్యస్వామి వారు మయూర వాహనంపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగారు. భక్తులు కావళ్లు సమర్పించుకున్నారు. స్వామివారిని కుప్పం రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్ సేవించుకున్నారు. ఆలయ నిర్వాహకులు అన్నదానం చేపట్టారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



విశేష అలంకరణలో సుబ్రమణ్యస్వామి

సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ కొత్త అపార్ట్‌మెంట్ బ్రోచర్ విడుదల

తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డు, అంకుర ఆస్పత్రి సమీపంలో సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ వారు నూతనంగా ఏర్పాటు చేసిన సీపీఆర్ కాస్మోస్ హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ బ్రోచర్‌ను ఆదివారం సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ చలపతిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్లకు నూతనమైన సదుపాయాలతో 2 బీహెచ్కే, 3బీహెచ్‌కే, 1230 స్క్వేర్ ఫీట్స్ నుంచి 2085 చదరపు అడుగుల వరకు అందుబాటులో ఉంచినట్టు వెల్లడించారు. విశాలవంతమైన అమినిటీస్ బ్లాక్ 15,000 స్క్వేర్ ఫీట్స్, క్రికెట్ పిచ్, బ్యాడ్మింటన్ కోర్ట్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, వాకింగ్ ట్రాక్, జాకింగ్ ట్రాక్ వంటి ఎన్నో సదుపాయాలు తమ కొత్త అపార్ట్‌మెంట్ వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ డైరెక్టర్స్ హర్షితరెడ్డి, లోకేష్‌రెడ్డి, వినీషా రెడ్డి, కాశీ విశ్వనాథ్‌రెడ్డి, సీనియర్ మేనేజర్ సోమేశ్వర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ప్రతినిధులు

గల్లంతైన విద్యార్థి మృతి

రాపూరు: సిద్ధిలేశ్వర కోనలోని ఆదివారం గల్లంతైన విద్యార్థి మృతి చెందినట్లు ఎస్‌ఐ మాల్యాద్రి తెలిపారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా, ఇస్కపల్లి గ్రామానికి చెందిన మనోజ్(21) పాండిచ్చేరిలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడని, వరుస సెలవలు నేపథ్యంలో తన మిత్రులతో కలిసి ఆదివారం సిద్ధిలేశ్వర కోనకు చేరుకున్నాడన్నారు. కోనలోని నీటిగుండంలో ఈత కొడుతుండగా మనోజ్ మునిగిపోయాడని తెలిపారు. అతని మిత్రులు రాపూరు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు, గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది సోమవారం ఉదయం మరోసారి గాలింపు చర్యలు చేపట్టగా మనోజ్ మృతదేహం బయట పడిందన్నారు. మనోజ్ తండ్రి శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంగ కాలువలో గుర్తు తెలియని మృతదేహం



కాలువలో తేలుతున్న మృతదేహం

వరదయ్యపాళెం: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తెలుగుగంగ కాలువలో కొట్టుకొచ్చిన ఘటన మండలంలోని నాగనందాపురం సమీపంలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం.. నాగనందాపురం సమీపంలోని తెలుగుగంగ కాలువలో గల కల్వర్టు వద్ద ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చి తేలాడుతోంది. మృతుడు ప్యాంటు, చొక్కా ధరించి ఉన్నాడు. వివరాలు పరిశీలించి మృతదేహాన్ని వెలికి తీస్తామని ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. అదృశ్యమైన వ్యక్తుల వివరాలుంటే స్టేషన్‌లో తెలపాలన్నారు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు



మంగమ్మ(ఫైల్)

ఏర్పేడు: వృద్ధురాలి అదృశ్యంపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల కథనం.. మండలంలోని కొత్తవీరాపురం అరుంధతీవాడకు చెందిన మంగమ్మ(70) ఆదివారం జ్వరంతో ఏర్పేడులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు వారి బంధువులు, ఏర్పేడులో వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇనుప బాక్సుల చోరీ

చంద్రగిరి: కాలువ నిర్మాణాల కోసం వినియోగించే 70 ఇనుప బాక్సులను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి వివరాల మేరకు.. ఒంగోలుకు చెందిన సింహాద్రి తాపీ మేస్త్రీ. మండల పరిధిలోని బుచ్చినాయుడుపల్లి గ్రామంలో కాలువ నిర్మాణాల కోసం రెండు రోజుల క్రితం సుమారు రూ.2.1 లక్షల విలువ చేసే 70 ఇనుప బాక్సులను గ్రామంలోని కమ్యూనిటీ భవనంలో భద్రపరిచాడు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సోమవారం పనులు చేసేందుకు కమ్యూనిటీ భవనం వద్దకు వెళ్లగా ఇనుప బాక్సులు కనిపించలేదు. దీంతో సింహాద్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వెంకటగిరిలో జాతరో జాతర!

- పోలేరమ్మ తల్లి జాతరకు పోటెత్తుతున్న భక్తులు
- రాష్ట్ర పండుగ నేపథ్యంలో భారీ ఏర్పాట్లు
- ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

సైదాపురం, వెంకటగిరి రూరల్: వెంకటగిరిలో జాతర శోభ ఉట్టిపడుతోంది. గ్రామశక్తి పోలేరమ్మ తల్లి జాతర రెండో రోజు సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుద్దీప కాంతులు ఆకట్టుకున్నాయి. రోజుకొక వినూత్న కార్యక్రమాలు స్థానికులను కట్టిపడేస్తున్నాయి. యువత కేరింతలు, ఈలలు మార్మోగుతున్నాయి. ప్రధానంగా కర్ణాటక డప్పు వ్యాయిద్యాలు, కొమ్ము నృత్యాలు జాతర శోభను ప్రతిబింబిస్తున్నాయి. అలాగే కావలి కోలాట నృత్యం, తెలంగాణా నేపథ్యంలో సాగే భక్తి పాటలు సంగీత ప్రియుల మనసును హోలలాడిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, రాజా కుటుంబీకులు సర్వజ్ఞ కుమారయాచేంద్ర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, నియోజకవర్గ నేతలు నెమళ్లపూడి సురేష్ రెడ్డి, ఢిల్లీబాబు, ప్రసాద్‌రెడ్డి, ఎల్.కోటేశ్వరరావు, సతీష్, కృష్ణారెడ్డి సహకారం అందిస్తున్నారు.



జాతర ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సర్వజ్ఞ కుమార యాచేంద్ర



కళాకారుల జానపద నృత్యం



వివిధ వేషధారణల్లో కళాకారులు